

నేడు ఏలూరు రానున్న డిజిపి



ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరానికి డిజిపి ద్వారకాతిరుమలరావు బుధవారం రానున్నారు. ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల ఎస్‌పిలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా రేంజ్ పరిధిలో నేరాల అదుపు, నేరాల వివరాలు పూర్తిగా అడిగి తెలుసుకోనున్నారు. నేరాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో ఏయే చర్యలు చేపట్టాలనే దానిపై డిజిపి దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

సీతారాం ఏచూరి ఆశయాలను.. ముందుకు తీసుకెళ్తాం

- సంస్మరణ సభలో ప్రతినబూనిన నేతలు
- ఏచూరి జీవితం సమాజానికి ఆదర్శనీయం
  శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు
- ఏచూరి మరణం దేశానికి తీవ్ర నష్టం
  ఎంఎల్ఎ అంజిబాబు
- సమాజం కోసం అధ్యయనం చేసిన వ్యక్తి ఏచూరి
  సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
- దేశం కన్న గొప్ప నాయకుల్లో ఒకరు సీతారాం ఏచూరి
  సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, వేదికపై వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు

ప్రజాశక్తి - భీమవరం

తన కోసం.. తన కుటుంబం కోసం.. తన భవిష్యత్తు కోసం ఆలోచించకుండా తుదిశ్వాస విడిచేవరకూ వామపక్ష పోరాటాలే ఊపిరిగా జీవించడమే కాకుండా ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పరితపించిన సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నేతలు ప్రతినబూనారు. తెలుగు గడ్డపై పుట్టి తెలుగుఖ్యాతిని ప్రపంచస్థాయిలో నిలిపిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని, ఆయన ఎంచుకున్న లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగడమే నిజమైన నివాళి అని అన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించగా తొలుత ఏచూరి చిత్రపటానికి శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్మరణ సభకు హాజరైన వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజాప్రతినిధులు ప్రముఖులు, వామపక్ష, లౌకికవాద పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ మహోన్నత యోధుడు సీతారాం ఏచూరి అని అన్నారు. ఆయన జీవితం సమాజానికి ఆదర్శనీయమని కొనియాడారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీకి మూడుసార్లు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఘనత ఆయన సొంతమన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, సమాజాభివృద్ధికి తోడ్పడడానికి ఏచూరిని ఆదర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డబ్బు రాజకీయాలను ధ్వంసం చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు చైతన్యప్రసాద్, షేక్ వలీ గీతాలను ఆలపించారు. సభలో సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

సమాజం కోసం అధ్యయనం చేసిన సీతారాం ఏచూరి ప్రత్యేకత

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



చిన్న వయసులోనే ఉద్యమాల బాటపట్టి దేశంలోనే అగ్ర నాయకునిగా ఎదిగిన ఘనత సీతారాం ఏచూరిది. పార్లమెంటు లోపల ప్రజా సమస్యలపై గళమెత్తి ప్రభుత్వాలను ప్రశ్నించడమే కాదు, పార్లమెంటు బయట కూడా ప్రజా పోరాటాలు జమిలిగా చేసి ఎన్నో పోరాటాలు నిర్మించిన వ్యక్తి ఏచూరి. 2007 నుంచి 2015 వరకూ పార్లమెంటులో ప్రజల తరఫున పోరాడి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరొందారు. ఉపాధి హామీ చట్టం, గిరిజనులకు అటవీ హక్కుల చట్టం తీసుకురావడంలో ఏచూరి కృషి ఎనలేనిది. సమాజం కోసం అధ్యయనం చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి. దేశంలోనే కాదు అంతర్జాతీయంగా అన్ని కమ్యూనిస్టు పార్టీలను, కమ్యూనిజాన్ని నిర్మించడానికి ప్రపంచవ్యాప్తంగా ఏచూరి ఎంతో కృషి చేశారు.

ఏచూరి మరణం దేశానికి తీవ్ర నష్టం

భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు



పోరాటాన్ని ఊపిరిగా చేసుకొని తుదిశ్వాస వరకూ ఉద్యమించిన మహా పోరాట యోధుడు సీతారాం ఏచూరి. అనర్గళంగా ఏడు భాషల్లో మాట్లాడగల ధీరుడు, అణగారిన ప్రజల సంక్షేమం కోసం చివరి వరకూ పోరాడిన మహోన్నత వ్యక్తి ఏచూరి. సమస్య పట్టుకుంటే పరిష్కారం అయ్యేంత వరకూ పట్టువిడకుండా పరిష్కారానికి పాటుపడే వ్యక్తి సీతారాం ఏచూరి మరణం సిపిఎంకే కాదు, దేశానికే తీరని లోటు.

దేశం కన్న గొప్ప నాయకుల్లో ఒకరు ఏచూరి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



దేశ రాజకీయాల్లో గుర్తించదగ్గ నాయకుల్లో సీతారాం ఏచూరి ఒకరు. దేశం కన్న నాయకుల్లో మహోన్నత వ్యక్తుల్లో ఏచూరి ఒకరు. సమాజానికి ఆయన మరణం తీరనిలోటు. ఇప్పటివరకూ జెఎన్‌యులో మాజీ విద్యార్థి భౌతికకాయం ఉంచలేదు. అయితే ఏచూరి మేధస్సును గుర్తించి ఆ గౌరవాన్ని ఇవ్వడం గర్వకారణం. రాష్ట్ర విభజన సమయంలో చివరి వరకూ పార్లమెంట్లో సమైక్యాంధ్ర కోసం పోరాడిన వ్యక్తి ఏచూరి. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేసినప్పుడు కాశ్మీర్‌లో పర్యటించేందుకు ప్రభుత్వం అంగీకరించకపోతే సుప్రీంకోర్టుకు వెళ్లి ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజల బాధలు తెలుసుకున్న వ్యక్తి ఏచూరి.

ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి

టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి



దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి. రాజ్యసభలో ఎన్నో విషయాలపై పోరాడడం అభినందనీయం. బడుగు బలహీన వర్గాలతోపాటు కార్మికులు, కర్షకుల సమస్యలపై నిస్వార్థంగా పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరి. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి.

సమాజం కోసం ఆలోచించిన వ్యక్తి ఏచూరి

జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు



ఇందిరాగాంధీని చిన్న వయస్సులోనే ఎదుర్కొన్న మేధావి ఏచూరి. అలాంటి నాయకుడిని దేశం కోల్పోవడం బాధాకరం. ఆయన ఆలోచనావిధానం ఎంతో గొప్పది. చివరి నిమిషం వరకూ సమాజానికి ఏ విధంగా ఉపయోగపడాలనే ఆలోచించారు. ఆయన భౌతికాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం గొప్ప విషయం.

ఏచూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు



ఉన్నత వర్గంలో పుట్టిన సీతారాం ఏచూరి తనకోసం కాకుండా శ్రమజీవులు, అణగారిన వర్గం కోసం నిరంతరం పోరాడారు. ఏచూరి మృతి దేశంలో వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు. రాజ్యాంగం సంక్షోభంలో పడింది. కుల మతాలకతీతంగా రాజ్యాంగ పరిరక్షణకు ఏచూరి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి. సమైక్యత, సమగ్రత పరిరక్షణకు కృషి చేయాలి. అప్పుడే ఏచూరికి నిజమైన నివాళులర్పించినవారమవుతాం.

చిరస్మరణీయులు ఏచూరి


కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పి.హరికుమార్‌రాజు



ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడానికి ఏచూరి కృషి ఎనలేనిది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని పిసిసి అధ్యక్షురాలు షర్మిల తో ఢిల్లీలో ఏచూరిని కలిశాం. నేను ఆంధ్రా వాడినే అని, ప్రత్యేక హోదా కోసం కలిసి పని చేస్తానని చెప్పారు. అటువంటి వ్యక్తి మృతి బాధాకరం.

వామపక్ష ఉద్యమానికి తీవ్ర నష్టం


ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకా కృష్ణమూర్తి



ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి నష్టదాయకం. ప్రజా సమస్యల పరిష్కారానికి ఏచూరిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి. అదే ఏచూరికి నిజమైన నివాళులు.

అజాత శత్రువు ఏచూరి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు



ఏచూరి మృతి పట్ల ప్రపంచదేశాలు ఘనంగా నివాళులర్పించాయి. మిత్రులు, శత్రువులు కూడా దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఏచూరి అజాత శత్రువు అనడానికి ఇది నిదర్శనం. పేదల సమస్యల పరిష్కారం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న విధానాల పట్ల ఏచూరి తనదైన శైలిలో పార్లమెంట్లో ఎండగట్టిన తీరు మాటల్లో చెప్పలేనిది.

25న ఆర్ఎస్ సంస్మరణ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్



సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ ఈ నెల 25న భీమవరంలో నిర్వహిస్తున్నాం. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో, ప్రజా ఉద్యమాల్లో ఆర్ఎస్ అందించిన సేవలు ఎనలేనివి. ఆర్ఎస్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ సంస్మరణ సభ నిర్వహించనున్నాం. ఈ సభకు అందరూ ఆహ్వానితులే. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు అగ్రనేతలు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనేతలు హాజరుకానున్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే స్వచ్ఛతా స్వప్నం సాకారం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ, మేయర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా భాగస్వామ్యంతోనే స్వచ్ఛతా స్వప్నం సాకారమవుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కూడలిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలను ప్రారంభించారు. తొలుత మానవహారం నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఫ్ల కార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇదే సమయంలో స్వీయ జాగ్రత్తలపై పారిశుధ్య సిబ్బందికి కలెక్టర్ వెట్రిసెల్వి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములవ్వాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో ఏలూరును స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలందరూ కృషి చేయాలని సూచించారు. ఇంటితో సమానంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యతనివ్వాలని, దీనికి ప్రజలు, అధికారులు భాగస్వామ్యంతో ముందుకెళ్లాలని అన్నారు. ఏలూరును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ నిరాటంకంగా శ్రమించాలని ఎంఎల్ఎ చంటి పిలుపునిచ్చారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై, ప్రజారోగ్యంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడంతోపాటు 50 డివిజన్ల పరిధిలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొల్లేరు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నేతలు

ఆక్రమణల వల్లే ముంపు సమస్య

సిపిఐ జాతీయ, రాష్ట్ర కార్యదర్శులు కె.నారాయణ, కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, మండవల్లి

ముంపు సమస్యకు ఆక్రమణలే కారణమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు పూర్తిగా ఫిష్ మాఫియా ఆక్రమణల కోరల్లో చిక్కుకుందని, ఫలితంగా ప్రాంతాల్లోని పట్టణాలు ముంపు బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. బుడమేరు, కొల్లేరు వరద ప్రభావిత ప్రాంతాలైన పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి నుంచి బుడమేరు వరకు సిపిఐ, రైతు సంఘం నేతలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ 1999లో కొల్లేరు సరస్సును ఐదో కాంటూరు వరకు 77,138 ఎకరాలను అభయారణ్యంగా గుర్తించి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కొల్లేరు ఆపరేషన్ పేరుతో 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 25 వేల ఎకరాల విస్తీర్ణంలో అక్రమిత చేపల చెరువులను ధ్వంసం చేసిందని, ఆనాడు సిపిఐ కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. కొల్లేరు సరస్సు మళ్లీ ఆక్రమణలకు గురైందని ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొల్లేరును ఆక్రమణల నుంచి తొలగించాలని, బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరులను ప్రక్షాళన చేయాలని అన్నారు. కొల్లేరును అభయారణ్యంగా ప్రకటించి కాపాడాలన్నారు. బడా చేపల రైతులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై కొల్లేరులో చేపలు, రొయ్యల సాగుతో దోచుకుంటున్నారని, దీన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొల్లేరును ఐదో కాంటూరు వరకు కాపాడాలని, అప్పుడే కొల్లేరు పక్షుల ఆవాసాలకు కేంద్రంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నేతలు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, పి.జమలయ్య, సిహెచ్ కోటేశ్వరరావు, జాన్సన్‌బాబు, రాయంకుల లక్ష్మణరావు, దొంతా కృష్ణ, జి.కోటేశ్వరరావు, సన్నేపల్లి సాయిబాబా, వరకా శ్యామల, మన్నవ యామిని తదితరులు పాల్గొన్నారు. డ్రెయినేజీ ఇంజినీరింగ్ అధికారులు ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని నేతలకు వివరించారు.

ఏచూరి, ఆర్ఎస్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నేతలు, మహిళలు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

సిపిఎం ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి, జిల్లా ఉద్యమ నిర్మాత, మాజీ ఎంఎల్ఎ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎస్ఆర్ నగర్‌లో మంగళవారం వ్యకాస నేత అనుమోలు మురళీ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. తొలత ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారన్నారు. మతతత్వం, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఏచూరి నిరంతరం పని చేశారన్నారు. దేశం, ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో సీతారాం ఏచూరి మృతి దేశానికి, ముఖ్యంగా వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటన్నారు. ఆర్ఎస్ మృతి జిల్లా ఉద్యమానికి తీరని లోటన్నారు. సభలో మండల నాయకులు బి.కుమారి, ముత్తమ్మ, పి.చెల్లమ్మ, అగ్గిరాముడు, శిరీష పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమం

ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న కృష్ణయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఉద్యమం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పవరుపేటలోని అన్నే భవనంలో రైతుసంఘం జిల్లా విస్తృత సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథి కృష్ణయ్య మాట్లాడుతూ రోజురోజుకీ రైతాంగ సమస్యలు పెరిగిపోతున్నాయని, కష్టపడి పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు కావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావడం లేదని విమర్శించారు. ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తేనే రైతుకు మేలు జరుగుతుందని చెప్పారు. రుణ విమోచన చట్టం తీసుకొచ్చి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు కేరళ వామపక్ష ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందని చెప్పారు. కనీసం తెలంగాణ రాష్ట్రంలో వలె రాష్ట్రంలో రైతులకు రూ.రెండు లక్షలు రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగిస్తే అవి రైతులకు ఉరితాడుగా మారుతాయని చెప్పిన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మరి ఇప్పుడేం చేస్తున్నారో రైతాంగానికి సమాధానం చెప్పాలని కోరారు. రైతాంగ సమస్యలపై జరిగే ఉద్యమంలో రైతులందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని డిమాండ్ చేశారు. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాల కాలువలను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 23, 24 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందని తెలిపారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కోనా శ్రీనివాసరావు, నేతలు ఘంటా పాపారావు, సున్నా వెంకటరావు, గుర్రం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి

నివాళులర్పించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

విరాట్ విశ్వకర్మను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఆమె జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలో కుల వృత్తులు ఎంతో కీలకమైనవన్నారు. సంప్రదాయ కళా నైపుణ్యాలను కలిగిన వారికి ప్రయోజనం కలిగించేలా ముఖ్యంగా బంగారు పనివారు, కమ్మరి పనివారు, నేతన్నలు, తాపీ పనివారు, కుమ్మరి పనివారు ఇలా వివిధ నైపుణ్యాలు కలిగిన కుటుంబాల వారికి విశ్వకర్మ యోజన ద్వారా ప్రభుత్వం సాధికారిత కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అలాంటి సంప్రదాయ వృత్తులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆయా వృత్తులు నిర్వహిస్తున్న వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమస్యలను, సూచనలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పొట్నూరి శివరాం, ఎలబాక కృష్ణ, కేళ్ల దుర్గాప్రసాద్, కెవి.బ్రహ్మం తదితరులు మాట్లాడుతూ పంచవృత్తులు నిర్వహించే వారికి సరైన పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. విశ్వకర్మ జయంతిని పబ్లిక్ హాలిడేగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వబ్రహ్మణులు అపర కర్మలు నిర్వహించుకునేందుకు ఏలూరు నగరంలో కొంతస్థలం కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కె.బాబ్జి, ఎపిఎంఐపి పీడీ రవికుమార్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, సర్వేశాఖ ఎడి పి.లక్ష్మణరావు, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇంటి తాళం అందిస్తున్న కలెక్టర్

ఇళ్లులేని పేదలకు పిఎం ఆవాస్ యోజన-2

ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. భువనేశ్వర్ నుంచి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లాలోని గృహనిర్మాణ శాఖాధికారులు, లబ్ధిదారులు పాల్గొని వీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా (2023-24) సంవత్సరానికి ఆరు నెలల ముందు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులైన ఏలూరు అర్బన్‌కు చెందిన పిల్లబోయిన అనసూయ, తాడి కుమారికి కలెక్టర్ ఇంటి తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ ఎ.శ్రీనివాసరావు, టిడ్కో ఇఇ స్వామినాయుడు, హౌసింగ్ డిఇ జి.రామకృష్ణ, హౌసింగ్ మేనేజర్ ఎమ్‌డి.షరీఫ్, హౌసింగ్ ఇఇలు, డిఇలు, ఎఇలు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తలకు, నాయకులకు "ఉపాధి హామీ ఆవశ్యకత - భూమి వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై" తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ తరగతులకు ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకొచ్చిన తర్వాత ఎన్‌డిఎ కూటమిలో భాగంగా పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులపైన దాడి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చేందుకు బిజెపి ప్రభుత్వం చూస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాలను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి అసలైన భూమి వారసులను గుర్తించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రానున్న కాలంలో అటవీ, అసైన్డ్, సీలింగ్ భూ సమస్యలపైన పెద్దఎత్తున ఆందోళన పోరాటాలకు ఈ రాజకీయ తరగతులు ఉత్తేజాన్నిచ్చాయని తెలిపారు. రానున్న కాలంలో భూ పోరాటాలు, ఇళ్లస్థలాల సమస్యలు గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. ఆ పోరాటంలో పేదలందరూ కలిసి రావాలని కోరారు. ఈ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. ఈ తరగతులకు జిల్లా అధ్యక్షులు జీవరత్నం అధ్యక్షత వహించగా తామా ముత్యాలమ్మ, రాజమండ్రి డానియల్, ఉడత వెంకటేష్, కారం దుర్గ, అందుగుల ప్రభాకర్ నాయకత్వం వహించారని తెలిపారు.

వీరిశెట్టిగూడెంలో నెమలి సంచారం

వైల్డ్ లైఫ్ జోన్‌కు తరలించిన అటవీ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి - కామవరపుకోట



వీరిశెట్టిగూడెంలో నెమలి

మండలంలోని వీరిశెట్టిగూడెంలో ఒక నెమలి రెండు రోజులుగా సంచరిస్తుంది. గ్రామంలో ఒక తోటలో నివాసం ఉంటూ వ్యవసాయ కూలీలుగా పని చేసేందుకు కె.యేసు, దేవి దంపతులు వచ్చారు. ఈ క్రమంలో తాము నివాసం ఉంటూ పని చేస్తున్న తోటలోకి నెమలి రాగా వారు వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది నెమలిని పట్టుకుని పాపికొండల్లో వైల్డ్ లైఫ్ జోన్‌కి తరలించారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో నైట్‌డ్యూటీ చేస్తున్న వైద్యురాలిపై పేషెంట్ సంబంధిత వ్యక్తులు చేసిన దౌర్జన్యాన్ని ఖండించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఎ.శ్యామలారాణి, జి.శారద కోరారు. మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాకర్‌కు ఐద్వా జిల్లా కమిటీ తరుపున వినతిపత్రం అందించారు. రోజురోజుకీ పెరుగుతున్న దాడులపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోనందువల్లే ఇవి పెరుగుతున్నాయని, గవర్నమెంట్ హాస్పటల్‌లో తగిన సెక్యూరిటీ సిబ్బందిని, పోలీసులను ఏర్పాటుచేసి వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సుధాకర్ మాట్లాడుతూ దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారని తెలిపారు.

నాగసుధారాణికి పిహెచ్‌డి పట్టా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నాగ సుధారాణి బెహరాకు ఆంధ్రా యూనివర్శిటీ విశాఖపట్నం వారిచే పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్ తెలిపారు. ఆంధ్రా యూనివర్శిటీ, మెకానికల్ విభాగం ఆచార్యులు డాక్టర్ పుట్టి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎకో ఫ్రెండ్లీ వైబ్రేషన్ ఎనర్జి హార్వెస్టింగ్ యూజింగ్ టెలిస్కోపిక్ షాక్ అబ్జార్జర్, పిజో ఎలక్ట్రిక్ సర్క్యూట్ అంశంపై పరిశోధన చేసినందుకు నాగ సుధారాణి బెహరాకు పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు పిహెచ్‌డి పట్టాను ఆమెకు అందించారు.

వరద బాధితులకు 'న్యూ జనరేషన్' సాయం

ప్రజాశక్తి - ఏలూరు



వాహనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమసుందరి

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మాటలు అందిపుచ్చుకుని ఏలూరు న్యూ జనరేషన్ హైస్కూల్ యాజమాన్యం వరద బాధితులకు సాయం చేసేందుకు ముందుకొచ్చింది. విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం ముందడుగు వేశారు. స్కూల్లో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వరద బాధితులకు అందించేందుకు ఆహారం, బియ్యం, నిత్యావసర సరుకులను ప్యాకింగ్ చేశారు. ఈ సందర్భంగా 37వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి సురేష్ వరద బాధితులకు నిత్యావసరాలు తరలిస్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యూ జనరేషన్ స్కూల్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. న్యూ జనరేషన్స్ స్కూల్ యాజమాన్యాన్ని కార్పొరేటర్ హేమసుందరి అభినందించారు. ప్రధానంగా వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయిన బాంబే కాలనీ ప్రజలకు న్యూ జనరేషన్ స్కూల్ అండగా నిలిచింది. సుమారు వెయ్యి మంది వరద బాధితులకు ఆహారం అందించడంతో పాటు మరో 500 మందికి నిత్యావసర సరుకులు, దుస్తులను అందించారు. ఈ సందర్భంగా బాంబే కాలనీలో పర్యటించిన ఏలూరు న్యూ జనరేషన్ స్కూల్ యాజమాన్యం వారికి కావాల్సిన అవసరాలను తెలుసుకుని దుస్తులు నిత్యావసర సరుకులు, ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో బేబీమేడం, డాక్టర్ వంకల గౌతమ, శ్రీడెంటల్ కొనకళ్ల రాజా, పాస్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరులోని సర్ సిఆర్ ఆర్.కాలేజీ ఆడిటోరియంలో కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పూర్వ విద్యార్థుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, సిఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి ఎంబిఎస్‌వి.ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి, జ్ఞాపికను అందించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.ఐదు వేలు నగదు ప్రోత్సాహక చెక్కులను ఎంఎల్ఎ అందించారు.

రైతులు ఇ-కెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

వరి పండించిన రైతులందరూ తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించాలని మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో వరి పైరును మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రంలో ఇ పంట నమోదు చేయించుకున్న, వరి సాగు చేస్తున్న రైతులందరూ తప్పని సరిగా ఇ కెవైసి చేయించాలన్నారు.

బుట్టాయగూడెంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జంగారెడ్డిగూడెం మమత మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండల కేంద్రంలో విద్యా రోహిణి పాఠశాల ప్రాంగణంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పోలవరం ఎంఎల్ఎ బాలరాజు ప్రారంభించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు మమత హాస్పిటల్ చిన్నిని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు శాలువ కప్పి సత్కరించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ముసునూరు :విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఇఒ జమలయ్య చెప్పారు. ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత మాట్లాడుతూ ప్రతినెలా వ్యాయామ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు స్కూల్లో అందరికీ రోల్ మోడల్‌గా ఉండాలన్నారు.

చింతలపూడి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి - చింతలపూడి

చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని, తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. కరాటేలో చింతలపూడి విద్యార్థులు రెండు గోల్డ్ మెడల్స్ సాధించడం ప్రశంసనీయమన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో ఏలూరులో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో చింతలపూడి స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు తొమ్మిది మంది పాల్గొని 12 మెడల్స్ సాధించి ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారని కోచ్ సుమన్‌రాజు స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నాలుగు బంగారు, రెండు రజత, ఆరు కాంస్య పతకాలతో మొత్తం 12 పతకాలు సాధించటం అభినందనీయమని తెలిపారు. ఇ.అక్షయ, టి.అద్విక, టి. భగత్ సింగ్‌లను, కోచ్‌ను ఎంఎల్ఎ అభినందించారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని కుక్కునూరు ప్రాజెక్ట్ పరిధిలోని కుక్కునూరు పంచాయతీలో జరిగే పోషకాహార కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.మయూరి, అంగన్వాడీ వర్కర్ వి.జయసుధ మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే ఆహారంపై శ్రద్ధ చూపాలన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

చాట్రాయి :తిరువూరు క్లస్టర్ పరిధిలోని వామకుంట్ల గ్రామంలో పాడి రైతు వంగల గోవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సంఘం తరపున పాడి గేదెలకు ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల కృష్ణా మిల్క్ యూనియన్‌లో యూనియన్ అందించే వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి రూ.లక్ష చెక్కును అందించారు. గోవర్ధన్ భార్య తిరుపతమ్మకు చీపురుగూడెం గ్రామానికి చెందిన కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, జిల్లా ట్రస్ట్ సభ్యులు పి.సత్యనారాయణ, క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షులు వంగల శేషగిరి చేతులమీదుగా అందించారు.

'అక్రమ కట్టడాలు ఆపాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆర్అండ్‌బి రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించి అక్రమ కట్టడాలను ఆర్అండ్‌బి అధికారులు నివారించాలని మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక వేత్త పాండురంగ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బొర్రంపాలెంలోని మెట్ట ప్రాంతంలో ఉన్న దేవాలయం వద్ద ఆర్అండ్‌బి రోడ్డు మార్జిన్ ఆక్రమించి కొందరు అక్రమ కట్టడాలు చేపట్టారన్నారు. రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించి కొందరు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలన్నారు.

ఆశ్రమంలో బాలికపై వ్యక్తి లైంగిక దాడి!

పోలీసులకు విద్యార్థినుల ఫిర్యాదు

నిందితుడి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బాలికలపై, మహిళలపై లైంగిక వేధింపులను, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళల కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ వేధింపులు, దాడులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా ఏలూరు నగరంలో స్వచ్ఛంద ఆశ్రమంలో ఆశ్రయం పొందుతూ నిరాశ్రయులైన బాలికలను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం... నగరంలోని అమీనాపేట ప్రాంతంలో శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం బాలికల వసతి గృహాన్ని గతేడాది ఫిబ్రవరి నెల పదో తేదీన ప్రారంభించారు. ఈ ఆశ్రమంలో నగరంలోని న్యాయశాస్త్రం రెండో సంవత్సరం చదువుతున్న లావణ్య కేర్ టేకర్‌గా పని చేస్తుంది. ఇదే ఆశ్రమంలో వార్డెన్‌గా ఫణిశ్రీ పని చేస్తుంది. ఈ ఆశ్రమంలో చిన్న తరగతి నుంచి డిగ్రీ వరకు దాదాపు 45 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వార్డెన్ ఫణిశ్రీ భర్త శశికుమార్ ప్రభుత్వ బిసి వెల్ఫేర్ విభాగంలో పని చేస్తుడంతో పాటు స్థానికంగా ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న బాలికలకు ఫొటో స్టూడియోకు గ్రాఫిక్స్ నేర్పిస్తానని కొంతకాలంగా ఇతను ఆశ్రమంలోనే మకాం వేశాడు. బాలికల ఆశ్రమంలో కేర్ టేకర్ వద్ద నుంచి వార్డెన్ వరకు అందరూ మహిళలే ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధన మీరి అతను ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉంటూ ఆశ్రమం పైభాగంలోఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తన కారులో ఆశ్రమానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినిని వేరొక ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు మంగళవారం విద్యార్థులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, రెండో పట్టణ సిఐ వెంకటరమణ, భీమడోలు సిఐ విల్సన్, మహిళా ఎస్ఐ నాగకళ్యాణి, రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఆశ్రమంలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగినట్లు ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామని, నిందితుడి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యకరంగా ఉంటారని పిజియోథెరపిస్టు జి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని రమణక్కపేట భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియ ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమలేశ్వరి పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం...చిన్నారులకు వికటించిన వైద్యం

ఎంఎల్ఎ చింతమనేని చొరవతో బాధితులకు నష్టపరిహారం

ప్రజాశక్తి - దెందులూరు

ఓ వైద్యుడి నిర్లక్ష్యంతో ప్రశ్నార్థకంగా మారిన ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ భరోసా కల్పించారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన చలమాల నాగరాజు కూలి పనులు చేస్తూ జీవిస్తుంటారు. సుమారు మూడేళ్ల క్రితం అతని కుమారుడు జగదీష్(12) ప్రమాదంలో గాయపడగా ఏలూరులోని ప్రభ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. అలాగే సూర్యారావుపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి మాగంటి వెంకటేశ్వరరావు కుమారుడు పూర్ణ(14) బైక్ ప్రమాదంలో గాయపడగా అతనికి కూడా గతంలో ఇదే ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేశారు. అయితే వైద్యం వికటించి బాలురు ఇద్దరూ కూడా ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని తల్లిదండ్రులు ఎన్ని సార్లు సంప్రదించినా నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ఈ నేపథ్యంలో ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను బాధిత కుటుంబ సభ్యులు కలిసి తమ దీన స్థితిని విన్నవించారు. ఎంఎల్ఎ పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు బాలుర సమస్యను తెలియచేస్తూ ఫిర్యాదు చేశారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ నేరుగా రంగంలోకి దిగటంతో ఎట్టకేలకు ఆసుపత్రి యాజమాన్యం బాధితులకు న్యాయం చేయటానికి ముందుకొచ్చింది. బాధిత చిన్నారులకు నష్టపరిహారంగా చెరో రూ.ఐదు లక్షలు బాధితుల తల్లిదండ్రులకు అందించారు. బాలలకు జరిగే మెరుగైన చికిత్స నిమిత్తం కూడా వారికి చెరొక రూ.లక్ష ఇస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని మాట్లాడుతూ బాలలకు ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన శస్త్రచికిత్స అందించేలా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. బాధిత కుటుంబసభ్యులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెదవేగి మండలాధ్యక్షులు బొప్పన సుధ, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొనకళ్ల శివమణి గౌడ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



భీమడోలులో...

రెండేళ్ల పైబడిన ప్రతిఒక్క విద్యార్థి నులి పురుగు నివారణ మాత్రలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు బడేటి నగర్ ఎస్ఎస్ స్మార్ట్ స్కూల్, గజ్జలవారి చెరువు శ్రీకృష్ణదేవరాయ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. నులిపురుగు వల్ల వ్యక్తి అలసటకు గురవుతాడని, చదువు మీద శ్రద్ధ ఉండదని, జ్ఞాపక శక్తి తగ్గిపోతుందని, శారీరక పెరుగుదల తగ్గిపోతుందని, ఏ విధమైన ఆటలు ఆడుకోలేడని తెలిపారు. ప్రతి విద్యార్థి నులి పురుగు నివారణ మాత్రలు ఆల్బెండజోల్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ హెల్త్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, స్కూల్ హెల్త్ మేనేజర్ నరేష్ బొప్పన, ఆరోగ్య కార్యకర్తలు శ్యామల, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు రాజ్యలక్ష్మి, ప్రమీల, గాయత్రి, సత్యవేణి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : పట్టణంలో 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చామని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.అనిల్‌కుమార్, హెల్త్ విజిటర్ కుమారి, లావణ్య, కుమారి, హెల్త్ అసిస్టెంట్ బాలరాజు, ఆశాలు పాల్గొన్నారు.

పెదపాడు : వట్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ముందుగా జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ పిల్లలకు మాత్రలు అందించారు.

భీమడోలు : మండలంలో జాతీయ నులి పురుగుల నిర్మూలనా దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు గుండుగొలను, పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల విస్తరణాధికారులు ఇందిరా, మల్లేశ్వరి, కిషోర్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమానికి ఆరోగ్య కేంద్రాల సిబ్బంది తమ వంతు సహకారాన్ని అందించినట్లు ఆరోగ్య విస్తరణ అధికారులు తెలిపారు.

చాట్రాయి : పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని ఎంపిపిఎస్ తుమ్మ గూడెం ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు చెప్పారు.

పోలవరం : మండలంలోని ఎల్ఎన్‌డి.పేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు వైద్య సిబ్బంది మింగించారు. మండలంలో 2,449 మంది విద్యార్థులకు 2,234 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు మలి విడతలో 215 మంది పిల్లలకు పంపిణీ చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

ముదినేపల్లి : చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం చేసుకోవచ్చని దేవపూడి పిహెచ్‌సి వైద్యులు వినయ్ అన్నారు. మండలంలోని దేవపూడి, ముదినేపల్లి, గురజ పిహెచ్‌సిల్లో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చేతుల పరిశుభ్రత గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

'స్వచ్ఛతా హి సేవ' ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామాలను స్వచ్ఛతగా ఉంచడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దెందులూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలకు స్వచ్ఛత ఆవశ్యకతను వివరించారు. స్థానిక సచివాలయం-1,2లతో పాటు గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించారు.

చింతలపూడి : స్థానిక ఫైర్‌స్టేషన్ వద్ద నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన మానవ హారంలో పాల్గొని, ప్రతిజ్ఞ చేశారు. జిబిజి రోడ్డులో చీపుర్లు చేతబట్టి చెత్తను శుభ్రం చేసి, డస్ట్ బిన్స్‌లో వేశారు. ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.

ముసునూరు :పరిశుభ్రత పాటించడం మనందరి బాధ్యత అని ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. కాట్రేనిపాడు సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముసునూరు సర్పంచి కొండేటి విజయలక్ష్మి తెలిపారు.

భీమడోలు :మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎంపిడిఒ పద్మావతి దేవి ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గుండుగొలనులో నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు హాజరయ్యారు. వీరితో పాటు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు సర్పంచి కె.లక్ష్మి అధ్యక్షత వహించారు. ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్ఎ మొక్కలను నాటారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. పారిశుధ్య కార్మికులను ఎంఎల్ఎ సత్కరించారు. మెడికల్ క్యాంపు తీరును పరిశీలించారు. ఇదేవిధంగా పోలసానిపల్లి, భీమడోలు గ్రామపంచాయతీల్లో కార్యక్రమానికి సర్పంచులు రహీమా బేగం హసేన, సునీత మాన్సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జీలుగుమిల్లి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపిడిఒ కెఆర్‌ఎస్.కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛతా హి సేవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో కలిసి పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని 15 పంచాయతీల్లో సర్పంచి, కార్యదర్శుల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఒ బిఎస్ఎల్.మంగాకుమారి పాల్గొని మాట్లాడారు. మక్కినవారిగూడెం హైస్కూల్లో సర్పంచి ఎం.గోపాలరావు ఆధ్వర్యంలో, టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

పోలవరం : పోలవరం సర్పంచి పొడుం పుష్ప, కొత్త పట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో పోలవరం పంచాయతీ నుంచి ర్యాలీ నిర్వహించారు. చుట్టుగుంట ప్రాంగణంలో ఉన్న చెత్తను పారిశుధ్య కార్మికులతో ట్రాక్టర్‌పై వేయించి శుభ్రం చేశారు. కొత్త పట్టిసీమ పంచాయతీలో మురుగు కాలువ డ్రెయినేజీలో పూడిక తొలగించడం, కల్వర్టులు కచ్చా డ్రెయిను పనులను పరిశీలించి ర్యాలీ నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి గాయాలపాలైన సంఘటన మండలంలోని బొర్రంపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడెం గ్రామానికి చెందిన గొవ్వాడ నాగు వ్యక్తిగత పని నిమిత్తం బొర్రంపాలెం వచ్చాడు. అక్కడ పని ముగించుకుని స్వగ్రామం బయలుదేరాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో నాగు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు.

బస్సును ఢీకొన్న ఆటో

ఉంగుటూరు :జాతీయ రహదారి ఉంగుటూరు మండలం కైకరం వద్ద ఆర్‌టిసి బస్సును ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. తణుకు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్లే క్రమంలో ప్రయాణికులను దించేందుకు ఆగుతుండగా దాని వెనకాలే వస్తున్న కూరగాయల ఆటో బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌కి గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్‌కి పంపించారు. బస్సులో ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని పోలీసులు చెప్పారు.

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఇటీవల గోదావరి వరదల కారణంగా కుక్కునూరు-దాచారం ప్రధాన రహదారి మధ్యలో గుండేటి వాగుపై ఉన్న కాంక్రీటు అప్రోచ్ ఇరువైపులా మట్టి కొట్టుకుపోయి భారీ గుండాలు ఏర్పడ్డాయి. రోడ్డంతా సుమారు రెండు కిలోమీటర్ల మేర ఒండ్రు పోసినందున రెండు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి నాయకులు మంగళవారం ఒండ్రును తొలగించే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కూటమి నాయకులు జెసిబీలతో రోడ్డు శుభ్రం చేయడం ప్రారంభించారు. అనంతరం వాగుకు ఇరువైపులా కాంక్రీట్ పనులను జనసేన మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ ప్రారంభించారు.

స్థిరాస్తి వేలం ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు

ఇ.పి.నెం. 28/2017 ఇన్

ఎఎ/సిఎఫ్/ నెం. 150/2015

Between:

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్ -డిక్రీ హోల్డర్

AND

ఆచంట నాగ సత్య శ్రీనివాస ప్రభాకర్ and 4 Others -జడ్జిమెంట్ డెబిటర్స్

5వ జేడిఆర్: శిరిగినీడి అంజిబాబు, S/o. కాశీ విశ్వనాధం, డోర్ నెం. 8-6-44, శివాలయం దగ్గర, కుమ్మరపేట, నర్సాపురం, ప॥గో॥జిల్లా.

పై నెంబరులో డిక్రీ వసూలు నిమిత్తం 5వ జేడిఆర్ తాలూకు ఈక్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూల్స్ దాఖలా స్థిరాస్తులను (1, 2, 3 ఐటమ్స్) **ది. 03-10-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు** బహిరంగ వేలము జరుగునని తెలియపరటమైనది. కావున వేలం పాటలో పాల్గొనువారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

5వ జేడిఆర్‌కు చెందిన ప్రోపర్టీ షెడ్యూల్స్ వివరములు:

ఐటమ్ నెం-1: పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం. 2620/2012, నర్సాపురం మున్సిపల్ ఏరియా 1వ వార్డు మాధవాయిపాలెం, లాకుపేట పెంకుటిల్లు డోర్ నెంబరు 5-1/1-16, సర్వే నెంబరు 150/1లో గల చ॥గ॥ 400కు అసెస్‌మెంటు నెం. 1077001871 కు ఈక్రింది సరిహద్దులు.

తూర్పు: అ. 60-09 మండా సూరిబాబు గారి స్థలం. **దక్షిణం:** అ. 55-09 Wall of Dudey Toju జాన్సీ లక్ష్మీబాయి, **పడమర:** అ. 68-06 గంటా సూర్యనారాయణ గారి స్థలం. **ఉత్తరం:** అ. 55-09 (15అ.) మెయిన్‌రోడ్.

డిక్రీ హోల్డర్ విలువ: రూ. 8,00,000/-

జెడిఆర్ విలువ: తెలియచేయలేదు

అమీనా విలువ: రూ. 18,00,000/-

ఐటమ్ నెం-2: పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం. 427/2012, నర్సాపురం మున్సిపల్ ఏరియా 1వ వార్డు, మాధవాయిపాలెం, లాకుపేట, ఖాళీ స్థలం డోర్ నెం. 5-1/1-16, సర్వే నెంబరు 150/1 లో గల చ॥గ॥ 348 కు ఈక్రింది సరిహద్దులు.

తూర్పు: అ. 52-0 పంట బోదె. **దక్షిణం:** అ. 54-3 (అ.15) ఉమ్మడి మార్గం. **పడమర:** అ. 53-0 పోలిశెట్టి దుర్గా శ్రీనివాస్ గారి స్థలం through sale agreement cum GPA. **ఉత్తరం:** అ. 65-0 కొల్లు ఏసుదాసు గారి స్థలం.

డిక్రీ హోల్డర్ విలువ: రూ. 7,00,000/-

జెడిఆర్ విలువ: తెలియచేయలేదు

అమీనా విలువ: రూ. 16,00,000/-

ఐటమ్ నెం-3: పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం. 2202/2011, సీతారామపురం సౌత్ విలేజ్ పంచాయతి ఏరియాలో జిరాయితీ మెరక పూరా య. 0.22 సెంట్లులో సర్వే నెంబరు 315/2 కు ఈక్రింది సరిహద్దులు.

తూర్పు: కూనపరెడ్డి చంద్రరావు గారి స్థలం. **దక్షిణం:** కూనపరెడ్డి సత్యన్నారాయణ గారి స్థలం. **పడమర:** మాదాసు పరశురామ్ గారి స్థలం. **ఉత్తరం:** పుంత.

డిక్రీ హోల్డర్ విలువ: రూ. 6,00,000/-

జెడిఆర్ విలువ: తెలియచేయలేదు

అమీనా విలువ: రూ. 12,00,000/-

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

నర్సాపురం ఎం.సత్యకృష్ణ

ది. 17-09-2024 అడ్వకేట్, నర్సాపురం

SOUTH INDIAN Bank జె.పి. రోడ్, భీమవరం బ్రాంచ్ 08816-231678

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది బంగారు ఆభరణములపై ఋణములు పొంది తిరిగి సకాలములో చెల్లించనందున ఈ క్రింది తెలియపరచిన బంగారు ఆభరణములను సౌత్ ఇండియన్ బ్యాంక్, భీమవరం బ్రాంచి నందు ది. 30-9-2024 మంగళవారం మధ్యాహ్నం 3 గం.లకు వేలం వేయుటకు నిర్ణయించడమైనది.

క్ర సం.	ఖాతా నెంబర్	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం గ్రాలలో	బకాయి
1.	098965300 0004144	బూరి వెంకట శ్రీనివాసు పెదపుల్లేరు, రామాలయం వీధి, ఉండి మండలం ప॥గో॥జిల్లా., ఆంధ్రప్రదేశ్-534 199	6	రూ.35,000/-
2.	098965300 0002544	ఇందుకూరి శివ కృష్ణంరాజు డోర్ నెం.1-45, శివాలయం వీధి, వసంతవాడ, తూ॥గో॥జిల్లా., ఆంధ్రప్రదేశ్-533 235	8.8	రూ.25,000/-

షరతులు - నిబంధనలు : 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ.3,000/- ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. అట్లు చెల్లించని ఎడల పాటదారులు తమ యొక్క ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. 3) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ, బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 5) ఈ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 6) అప్పు వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలము తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును.

తేది : 17-9-2024 సం/- బ్రాంచ్ మేనేజర్, భీమవరం